సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 23 । నవంబర్ । 2024



సోమశిలలో 70.913 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 70.913 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డెల్టాకు 2,250, ఉత్తరకాలువకు 700, కండలేరుకు 2,100, దక్షిణకాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.79,950
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,242
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,459
నవర (8 గ్రాములు)	రూ.59,672

గరిష్టం/కనిష్టం
30.0 /22.6

వాతావరణం

జిల్లాలో శనివారం వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 73 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సీఈఓ విద్యారమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించి సమీక్షించనున్నారు. సమావేశానికి జెడ్పీ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తాం

- కలెక్టర్ ఆనంద్



నార్తురాజుపాళెంలో గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

కొడవలూరు: జిల్లాలో గిరిజనులంతా ప్రధానంగా ఆధార్, ఇంటి వసతి, జాబ్‌కార్డులు లేకపోవడం వంటి మూడు సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని కలెక్టర్ ఓ.ఆనంద్ స్పష్టం చేశారు. మండలంలోని నార్తురాజుపాళెం వినాయకనగర్ గిరిజన కాలనీని శుక్రవారం ఆయన సందర్శించి కనీస వసతులకు దూరంగా జీవిస్తున్న తీరును పరిశీలించారు. గిరిజనులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. తాగునీటి వసతి లేక కాలువ నీటినే వాడుతున్నామని కలెక్టర్‌కు తెలిపారు. తీవ్రమైన ఈ సమస్యపై స్పందించిన కలెక్టర్ నీళ్ల ట్యాంక్ సదుపాయం కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఇంటి వసతి విషయమై కలెక్టర్ దృష్టికి తెచ్చారు. హౌసింగ్ పీడీ వేణుగోపాల్‌ను పిలిచి గిరిజనుల ఇంటి నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్థానిక స్వాగత్ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడారు. గిరిజనులందరికీ ఆధార్ కార్డుల సదుపాయం కల్పించే ప్రక్రియ ఇప్పటికే ఆరంభించామన్నారు. ఇంటి సమస్యలతోపాటు జాబ్ కార్డులు ఇచ్చేలా సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. నీటి, డ్రెయినేజీ, కరెంట్ వసతులను కూడా ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏఆర్డీ సంస్థ ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వంశీకృష్ణ, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఐటీడీఏ పీఓ పరిమళ, హౌసింగ్ డీఈ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కె.స్ఫూర్తి, ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు, ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

హోమ్‌గార్డ్స్ డీఎస్పీ బదిలీ


నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర వ్యాప్తంగా 29 మంది ఏఆర్ డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా నెల్లూరు హోమ్‌గార్డ్ డీఎస్పీగా పనిచేస్తున్న కె.సుంకరయ్య ఆక్టోపస్‌కు బదిలీ కాగా, అక్కడ విధుల్లో ఉన్న ఎస్వీ రమణ నెల్లూరు హోమ్ గార్డు డీఎస్పీగా నియమితులయ్యారు.

ఆర్‌ఐకు పదోన్నతి

నెల్లూరులో ఉన్న ఆర్‌ఐ కె.థామస్‌రెడ్డి డీఎస్పీగా పదోన్నతి పొంది పార్వతీపురం మన్యం ఏఆర్ డీఎస్పీగా నియమితులయ్యారు.

ఆకాశమే హద్దుగా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచి నిత్యావసరాల ధరలు ఆకాశమే హద్దుగా తగ్గేదే లేదన్నట్లు పెరుగుతున్నాయి. ఆరు నెలలకుపైగా ఏ వస్తువు ధర కూడా తగ్గిన పరిణామమే లేదు. సగటు కుటుంబాలపై ఆర్థిక భారం పడి విలవిలలాడుతున్నాయి. ధరలు నియంత్రించాల్సిన పాలకులు ఆ పనికి స్వస్తి పలికారు. ప్రతిపక్షం అణచివేతపై దృష్టి సారించారే తప్ప.. ప్రజా శ్రేయస్సుపై మనస్సు పెట్టిన పాపాన పోలేదు. అధికార యంత్రాంగం కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది.



- ఆరు నెలలుగా పైపైకి దూసుకెళ్తున్న ధరలు
- పప్పులు, నూనెలతోపాటు కూరగాయలు
- సగటు కుటుంబాలపై ఆర్థిక భారం
- అందుబాటు ధరలకు తగ్గించడంలో అధికారులు, పాలకుల వైఫల్యం
- నూనెల ధరలు పెంచిన ఫ్యాక్టరీలపై చర్యలు శూన్యం
- తగ్గించాలంటూ వ్యాపారులపై ఒత్తిడి

ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తున్నాం

నిత్యావసర సరుకుల ధరలను అదుపులోకి తెచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతు బజార్లలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి తక్కువ ధరలకే కందిపప్పు, పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తాం. ఇందు కోసం హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో చర్చిస్తున్నాం. పరిశ్రమల్లోనే అత్యధిక ధరలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. అక్కడి నుంచి ధరలు తగ్గించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

– వెంకటరమణ, డీఎస్‌ఓ

పప్పులు/నూనెలు	వైఎస్సార్‌సీపీ పాలనలో	కూటమి పాలనలో
కందిపప్పు	రూ.150 - రూ.165	రూ.190 - రూ.210
వేరుశనగ నూనె	రూ.140 - రూ.155	రూ.170 - రూ.190
పామాయిల్	రూ.90 - రూ.98	రూ.120 - రూ.135
సన్‌ఫ్లవర్	రూ.100 - రూ.113	రూ.140 - రూ.150
రైస్‌బ్రాన్	రూ.125 - రూ.130	రూ.140 - రూ.150

కూరగాయలు (కిలో)	వైఎస్సార్‌సీపీ పాలనలో	కూటమి పాలనలో
టమాటా	రూ.25 - రూ.30	రూ.80 - రూ.100
బంగాళదుంప	రూ.30 - రూ.35	రూ.50 - రూ.60
ఉల్లిపాయలు	రూ.25 - రూ.30	రూ.40 - రూ.50
బీరకాయలు	రూ.30 - రూ.40	రూ.80 - రూ.90
దొండకాయలు	రూ.35 - రూ.45	రూ.70 - రూ.75

నెల్లూరు (పొగతోట): జిల్లాలో పప్పులు, ఉప్పులు, నూనెల నుంచి కూరగాయల వరకు ధరలు భగ్గుమంటున్నాయి. ఏ వస్తువు పట్టుకున్నా.. ఏ కూరగాయ తీసుకున్నా.. ధరలు షాక్ కొట్టే రీతిలో ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిత్యావసర ధరలు స్థిరంగా ఉన్నాయి. మార్కెట్‌లో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే.. వెంటనే అప్పటి ప్రభుత్వం స్పందించి రైతుబజార్ల ద్వారా సబ్సిడీ ధరలకే అందిస్తూ మార్కెట్లో వ్యాపారుల దోపిడీకి కళ్లెం వేస్తూ వచ్చింది. ఆ ప్రభుత్వ హయాంలో వరుస పెట్టి కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని కొద్దిపాటి ధరలు పెరిగితే ఇదే కూటమి నేతలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. ఇప్పుడు ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక ధరలు రెండింతలు పెరిగిపోయినా.. నియంత్రణకు ఏ విధంగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కూటమి అధికారంలోకి వస్తే నిత్యావసరాల ధరలు తగ్గిస్తామంటూ ప్రజలకు మాయమాటలు చెప్పింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు ఆకాశాన్నంటుతున్నా.. 'దున్నపోతు మీద వాన పడుతున్నా.. చలించని' చందంగా వ్యవహరిస్తోంది. జిల్లాలో దాదాపు 30 లక్షల మంది ప్రజల జీవనంపై ధరల ప్రభావం పడుతోంది. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే రాష్ట్రం, జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరలు అధికంగా ఉన్నాయి.



పరిశ్రమల్లోనే నూనెల ధరలు అధికం

నూనెల ధరలు అయితే పరిశ్రమలే పెంచాయి. అక్కడే ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అది తమ చేతుల్లో లేదంటూ వ్యాపారులపై తగ్గించాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఈ ప్రయత్నానికి తిలోదకాలు ఇచ్చారు. అధికారులు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వ్యాపారులపై తక్కువ ధరలకు విక్రయించాలంటూ ఒత్తిడి పెంచుతున్నారు. పరిశ్రమల నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్ వ్యాపారులకు రూ.137లకు (ప్రతి రోజూ వ్యత్యాసం ఉంటుంది) రవాణా చార్జీలు అన్నీ కలుపుకుని అందుబాటులోకి వస్తుంది. వ్యాపారులు రూ.140 నుంచి రూ.150కు విక్రయిస్తున్నారు. పామాయిల్ రూ.120 పడుతోంది.

రైతుబజార్‌లో సబ్సిడీకి సరఫరా చేయాలి

అయితే రైతుబజార్‌లో రేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే సబ్సిడీ ధరకు నిత్యావసరాలు విక్రయించాలని హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులపై అధికారులు ఒత్తిడి పెంచుతున్నారు. సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124కు, పామాయిల్ రూ.104కు, కందిపప్పు రూ.150కు విక్రయించాలంటూ హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులపై అధికారులు ఒత్తిడి చేయడంతో నష్టానికి అమ్మలేమంటూ వ్యాపారులు తెగేసి చెబుతున్నారు. ఇలా చేస్తే లీటర్‌కు నూనెలపై రూ.15 నుంచి రూ.20, కందిపప్పుపై రూ.30 నుంచి రూ.40 నష్ట పోతున్నామంటున్నారు. నూనెల పరిశ్రమలు, పప్పు మిల్స్ యాజమాన్యాలు ధరలు తగ్గించి విక్రయించేలా ప్రభుత్వం చర్యలు చేపడితే సాధ్యమవుతుందంటున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమాధానం చెప్పలేక అటు అధికారుల ఆదేశాలను పాటించలేక హోల్‌సేల్ వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ధరల నియంత్రణకు చర్యలు

- జేసీ కె.కార్తీక్

నెల్లూరు రూరల్: మార్కెట్లో నిత్యావసరాల ధరలు అందుబాటులో ఉండాలని, సంబంధిత శాఖల అధికారులు ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ చెప్పారు. ధరలకు కళ్లెం వేసేందుకు ప్రతి మండలంలో ప్రత్యేక విక్రయ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్లో జిల్లా స్థాయి ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపిక చేసిన కేంద్రాలు, రైతుబజార్లలో పామాయిల్ లీటర్ రూ.110కే వినియోగదారులకు అందించాలన్నారు. నాణ్యమైన ఉల్లిపాయలు కిలో రూ.35కే అందిస్తున్నామన్నారు. పారదర్శకత కోసం ఈ ధరలను సూచించే బోర్డు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకు నిత్యావసరాలు అమ్మకపోతే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో హోల్‌సేల్ షాపుల్లోని నిల్వలను నమోదు చేయాలన్నారు. ధరల నియంత్రణ కమిటీ సమావేశం తరచూ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఇందుకోసం కొత్తగా సెల్ ఏర్పాటు చేసామని, ప్రతి రోజూ ఒక హోల్‌సేల్, ముగ్గురు రిటైల్ వ్యాపారస్తుల నుంచి ధరల వివరాలు సేకరించి నివేదిక పంపాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ వెంకటరమణ, మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత, పౌరసరఫరాల డీఎం నరసింహారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సత్యవాణి, జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, వివిధ ఆయిల్ కంపెనీల వ్యాపారస్తులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కె కార్తీక్

జిల్లాపై ఫ్లూ పంజా

- జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న రోగులు
- నిర్లక్ష్యం చేస్తే న్యూమోనియాకు దారితీసే అవకాశం
- చలికాలంలో పెరుగుతున్న కేసులు



నెల్లూరు ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్ నాలుగు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. ముక్కునుంచి నీరు లాగా కారడం, గొంతు నొప్పి, కండరాలనొప్పి, తలనొప్పి, దగ్గు, నీరసం, చలి వంటి లక్షణాలతో స్థానిక శంకరాగ్రహారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లాడు. అక్కడ పరిశీలించిన డాక్టర్లు మలేరియా, డెంగీతో పాటు, టైఫాయిడ్ లాంటి రక్తపరీక్షలు చేశారు. అన్నీ నార్మల్‌గా వచ్చాయి. చివరకు శీతాకాలంలో వచ్చే ఫ్లూ జ్వరంగా నిర్ధారించారు. రెండు రోజులు ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని సెలైన్లు పెట్టి నీరసం తగ్గించారు. జిల్లాలో అనేక మంది ఇదే విధంగా బాధపడుతున్నారు.

– నెల్లూరు(అర్బన్)

ఇలా వ్యాపిస్తుంది



- వర్షాకాలంతో పాటు శీతాకాలం ఫ్లూ జ్వరాలకు అనుకూలం. హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా అనే వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుంది. జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లునొప్పులు, తలనొప్పి, అలసట లాంటి లక్షణాలు ఉంటాయి.
- ఐఎంఏ అంచనాల ప్రకారం జిల్లాలో 10 శాతం మంది రోగులు ఫ్లూ జ్వరంతో బాధపడుతున్నారు. అంటే సుమారు 2.70 లక్షల మంది ఫ్లూ జ్వరపీడితులే. ఎక్కువ మందికి మూడు, నుంచి నాలుగు రోజుల్లో తగ్గిపోతుండటం కొంతవరకు ఊరటనిస్తోంది.
- జిల్లాలో 52 పీహెచ్‌సీలు, 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 2 ఏరియా ఆస్పత్రులు, ఒక జిల్లా ఆస్పత్రితో పాటు నెల్లూరులో బోధనాస్పత్రి ఉన్నాయి. వీటిల్లో జ్వరపీడితులే ఎక్కువగా ఉన్నారు. ప్రైవేటు ఆస్పత్రులలో కూడా ఇదే పరిస్థితి.
- వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఎక్కువగా ఫ్లూ సులభంగా అంటుకుంటుంది. అలాగే ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడేవారు, బ్రాంకైటిస్, హార్ట్‌ఫెయిల్యూర్, కరొనరీ ఆర్టరీ డిసీజ్ బాధితులు, కిడ్నీ, లివర్ సమస్య ఉన్న వారు ఫ్లూతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఎక్కువ.
- ఫ్లూ జబ్బు అనేది తుమ్మినా, దగ్గినా వాటి రేణువులు పక్కవారి మీద పడటంతో సులభతరంగా ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. ఆకస్మిక వాతావరణ మార్పుల వల్ల కూడా ఈ వైరస్ విజృంభిస్తోందని వైద్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పరీక్ష ఎలాగంటే..

ముక్కు, గొంతు స్వాబ్‌తో పరీక్ష చేయించుకోవడం ద్వారా కరోనా, ఇన్‌ఫ్లూయెంజా వైరల్ ఇన్‌ఫెక్షన్స్ ఉన్నాయో లేదో నిర్ధారణ చేయవచ్చు. తీవ్రత తక్కువగా ఉంటే ఇంటి వద్దనే డాక్టర్ సలహా మేరకు మందులు వాడవచ్చు. విపరీతమైన దగ్గు, ఆయాసం ఉంటే ఆస్పత్రికి వెళ్లాలి. ఫ్లూ జబ్బులకు యాంటీబయాటిక్స్ మందులు పెద్దగా పని చేయవు. యాంటి వైరల్ మందులు మాత్రల రూపంలో గాని, ద్రవ రూపంలో గాని వాడాలి.

భయపడాల్సిన పని లేదు



ఫ్లూ అనేది సీజనల్‌గా వచ్చే వ్యాధి. భయపడాల్సిన పనిలేదు. కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేతిరుమాలు అడ్డు పెట్టుకోవాలి. ఫ్లూ ఉన్నవారు పక్కవారితో కొంచెం దూరంగా ఉండి మాట్లాడాలి. పిల్లలకు ఆరు, ఏడు నెలల నుంచి ఫ్లూ వ్యాక్సిన్ వేయించాలి. పెద్దలు, వృద్ధులు ప్రతి సంవత్సరం ఒక డోసు వ్యాక్సిన్ వేయించుకోవడం మంచిది.

– డాక్టర్ గంగాధర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో వాతావరణం మారిన నేపథ్యంలో సీజనల్ జ్వరాలు పెరిగే అవకాశం ఉంది. ఫ్లూ అనేది కూడా వైరస్ వల్ల వచ్చే సీజనల్ వ్యాధి. ఈ సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తల ద్వారా జబ్బులు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నాం.

– పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ, వైద్య, ఆరోగ్యశాఖ

మెప్మా పీడీగా రాధమ్మ బాధ్యతలు



నెల్లూరు (బారకాసు): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమితులైన రాధమ్మ సుబేదారుపేటలో ఉన్న ఆ సంస్థ జిల్లా కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు మెప్మా పీడీగా ఉన్న ఆమె సాధారణ బదిలీల్లో నెల్లూరుకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పీడీగా విధులు నిర్వర్తించిన రవీంద్ర చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

డీసీసీబీలో 17 మందికి ఉద్యోగోన్నతులు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో విధులు నిర్వహిస్తున్న 17 మందికి పదోన్నతులు కల్పిస్తూ శుక్రవారం జేసీ కార్తీక్ ఉత్తర్వులు అందజేశారు. గాంధీబొమ్మ సెంటర్‌లోని డీసీసీబీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరుగురు మేనేజర్లకు చీఫ్ మేనేజర్లుగా, ఐదుగురు అసిస్టెంట్ మేనేజర్లకు మేనేజర్లుగా, ఆరుగురు స్టాఫ్ అసిస్టెంట్లకు అసిస్టెంట్ మేనేజర్లుగా పదోన్నతి కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ శ్రీనివాసరావు, చీఫ్ జనరల్ మేనేజర్ వై.సరిత, డీజీఎంలు ఉషారాణి పాల్గొన్నారు.



జేసీ నుంచి పదోన్నతి పత్రాలు అందుకుంటున్న డీసీసీబీ అధికారులు

స్వేచ్ఛను హరించే పాలన

- మోసాలు, వైఫల్యాలను నిలదీస్తే అక్రమ కేసులు
- భావ ప్రకటన స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదు
- పార్టీ శ్రేణులను ఇబ్బందిపెట్టిన ఏ ఒక్కరినీ విడిచిపెట్టం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టిన వారిపై కేసులు నమోదుచేయాలి

నెల్లూరు (క్రైమ్): రాజ్యాంగం ప్రజలకు కల్పించిన స్వేచ్ఛను హరించేలా చంద్రబాబు పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, ఆయన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో అనుచిత, అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్‌కు శుక్రవారం పార్టీ నేతలతో కలిసి ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో పోస్టులకు సంబంధించిన వివరాలను ఇన్‌స్పెక్టర్‌కు అందజేశారు. అనంతరం కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలు చేయలేదని, ప్రజలను మభ్య పెడుతున్నారని ఎవరు ప్రశ్నించినా వారిపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారన్నారు. తనపైనే మూడు కేసులు పెట్టారన్నారు. సోషల్ మీడియాతో ఇంత దారుణంగా ఏ ప్రభుత్వం వ్యవహరించలేదన్నారు. ఎమర్జెన్సీ రోజులు, బ్రిటిష్ పాలనలో ఇలాంటి నిర్బంధాలు, దారుణాలు చూడలేదన్నారు.



స్టేషన్ బయట మీడియాతో మాట్లాడుతున్న కాకాణి

చట్టం అందరికీ ఒకేలా ఉండాలన్నారు.

ఆవేదన.. ఆవేశంగా మారితే..

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉన్న ఆవేదన ఆవేశంగా మారి రోడ్డెక్కడం ప్రారంభిస్తే ఈ ప్రభుత్వం, పోలీసులు, అధికారులు తట్టుకోలేరని కాకాణి హెచ్చరించారు. కూటమి నేతల దాష్టీకాలు పెరిగితే... భవిష్యత్‌లో శాంతిభద్రతల సమస్యకు దారి తీస్తుందని, దానికి రాష్ట్ర ప్రభుత్వం, అధికారులే నైతిక బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే ఈ ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, చంద్రబాబు మోసాలపై ప్రజలు కసితో రగిలిపోతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్ద పీట వేసిందని, పాలన బ్రహ్మాండంగా ఉందని ప్రజలే చెబుతున్నారన్నారు. ఇది పాలకులకు కంటగింపుగా మారిందన్నారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళితే ప్రజాసమస్యల మీద, సంక్షేమ కార్యక్రమాలపై గళం విప్పేవారన్నారు. అయితే కూటమి ఎమ్మెల్యేలు ఆ పని వదిలేసి, మాజీ ఎమ్మెల్యేలపై మీద ఫిర్యాదులు ఎత్తుకుని విచారణ జరపాలని అధికారులను ఆదేశిస్తున్నారన్నారు. తాము అధికారంలో ఉన్న సమయంలో కక్ష సాధింపు చర్యలకు, అణిచివేత ధోరణికి పాల్పడి ఉంటే ఈ రోజు నేటి ప్రజాప్రతినిధులకు కనీసం పోటీ చేసే శక్తి, సామర్థ్యాలు కూడా ఉండేవి కావన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి మహమ్మద్ ఖలీల్ అహ్మద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏ ఒక్కరినీ విడిచిపెట్టం

ఈ రోజు మనది కాకపోవచ్చు, అధికారంలో లేకపోవచ్చు, దాడులు జరగొచ్చు, కేసులు పెట్టొచ్చు, జైళ్లకు పంపొచ్చు.. ఎవరూ అధైర్యపడొద్దు, లోకేశ్ మాదిరిగా మాకు రెడ్‌బుక్ అవసరం లేదు. మీపై అనుచితంగా ప్రవర్తిస్తున్న, పోస్టులు పెడుతున్న వారి పేర్లను నమోదు చేసుకోండి. మిమ్మల్ని ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ విడిచి పెట్టమని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు భరోసానిచ్చారు. అధికారం ఏ ఒక్కరికీ శాశ్వతం కాదన్న విషయాన్ని టీడీపీ నేతలు, వారితో అంటకాగుతున్న అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. కేసులకు, అరెస్ట్‌లకు, జైళ్లకు బయపడే వారు ఎవరూ లేరన్నారు. రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సప్తసముద్రాల అవతల ఉన్నా పట్టి తెచ్చిశిక్షిస్తామని హెచ్చరించారు. పోలీసులు రాజ్యాంగ బద్ధంగా మసులుకోవాలన్నారు.



సీఐ కిషోర్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న నేతలు

నేడు, రేపూ ఓట్ల నమోదు

నెల్లూరురూరల్: జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌ఓలు శని,ఆదివారాల్లో ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తారని డీఆర్‌ఓ ఉదయభాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా ఉంచుతారన్నారు. ఓటర్ల పేర్లు, చిరునామాల మార్పులు కోరుతూ బీఎల్‌ఓలకు ఫారం-6, ఫారం-7, ఫారం-8 పూర్తి చేసి అందించాలన్నారు.

క్లుప్తంగా

లైంగికదాడి కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

నెల్లూరు(లీగల్): లారీలో ప్రయాణిస్తున్న బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన పప్పర్తి సుబ్బరాయుడు అనే వ్యక్తికి 20 ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ.22 వేల జరిమానా విధిస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సి.సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2020 సంవత్సరం మే నెలలో 14 ఏళ్ల బాలిక, ఆమె చిన్నాన్న ఆత్మకూరు సమీపంలోని నెల్లూరుపాళెం వద్ద లారీ ఎక్కారు. డ్రైవర్ సుబ్బరాయుడు సంగం వద్ద లారీని ఆపి హోటల్లో టిఫిన్ ఉందేమో కనుక్కోవాలని బాలిక చిన్నాన్నను పంపాడు. అతను వెళ్లగా సుబ్బరాయుడు వేగంగా లారీని కృష్ణపట్నం పోర్టు వైపునకు తీసుకెళ్లాడు. జాతీయ రహదారి పక్కన ఆపి బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఆమె చిన్నాన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పైమేరకు నిందితుడికి శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఐటీడీఏ విద్యార్థులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్వాతంత్య్ర సమర యోధుడు బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని జన జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు నెల్లూరు ఐటీడీఏ తరఫున 60 మంది విద్యార్థులను పంపామని ప్రాజెక్ట్ అధికారిణి పరిమళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి వారంరోజులపాటు జిల్లాస్థాయిలో క్రీడా, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశామన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను శనివారం నుంచి 26వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపామన్నారు. శారీ పెయింటింగ్, మిల్లెట్ పౌడర్, బిస్కెట్ తయారు చేసే వారిని సైతం పోటీలకు పంపుతున్నామని వివరించారు.

విద్యార్థినిపై కర్రతో దాడి

మర్రిపాడు: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో పదో తరగతి చదువుతున్న రెహానా అనే విద్యార్థిపై అదే గ్రామానికి చెందిన చెరుకూరి మదర్ సాహెబ్ కర్రతో దాడి చేసి గాయపరిచాడు. బాలికను కుటుంబసభ్యులు ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఈ ఘటనపై పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. రెహానా, మదర్ సాహెబ్ కుటుంబాల మధ్య పాతకక్షలు న్నాయి. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం రెహానా తన ఇంట్లో హోంవర్క్ చేసుకుంటుండగా మదర్ సాహెబ్ అక్కడికి వెళ్లి అసభ్యంగా తిట్టి కర్రతో దాడి చేశాడు. ఈ విషయం తెలుసుకున్న బాధిత తల్లిదండ్రులు కుమార్తెను ఆస్పత్రికి తీసుకెళ్లారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


ప్రభాకర్ మృతదేహం

కావలి: కావలి రూరల్ మండలం మోర్లవారిపాళెం గ్రామానికి చెందిన కట్టా ప్రభాకర్ (43) అనే గిరిజన కౌలు రైతు విద్యుత్ షాక్‌తో శుక్రవారం మృతిచెందాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద ప్రభాకర్ మూడెకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ చెడిపోవడంతో దానిని వేసి ఆన్ చేశాడు. వెంటనే విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. సమీపంలోని వారు చికిత్స నిమిత్తం కావలిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ప్రభాకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

పెన్షన్ ఇస్తాం

నెల్లూరు(పొగతోట): లబ్ధిదారులు ఏదైనా కారణంతో ఒక నెలలో పెన్షన్ తీసుకోకుంటే తర్వాతి నెలలో రెండు నెలలకు సంబంధించిన నగదు ఇస్తామని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుసగా రెండు నెలలు తీసుకోకుండా ఉంటే ఆ తర్వాతి నెలలో మూడు నెలల నగదు ఒకేసారి అందజేస్తామని తెలియజేశారు. అయితే మూడునెలలు వరుసగా తీసుకోకుండా ఉండే లబ్ధిదారులను మాత్రం నిలిపి వేస్తామన్నారు. వారు మళ్లీ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే పూర్తిస్థాయిలో పరిశీలించి మంజూరు చేస్తామని వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్): 97
లేయర్ (లైవ్): 110
బ్రాయిలర్ చికెన్: 180
బ్రాయిలర్ స్కిన్‌లెస్: 200
లేయర్ చికెన్: 187

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి: రూ.35
సన్నవి: రూ.25
పండ్లు: రూ.15


అండర్ బ్రిడ్జి కింద మురుగునీరు




కాళ్లు ఇలా పెట్టాల్సిందే..


దుర్వాసన భరించలేకున్నా..


నగరమా.. నరకమా!

రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లూరులో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. రహదారులు దారుణంగా ఉన్నాయి. వాటిపై ప్రయాణించాలంటే వాహనదారులు హడలిపోతున్న పరిస్థితులున్నాయి. వీఆర్సీ సెంటర్‌కు వెళ్లే దారిలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి కింద రాకపోకలు సాగించాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తూ ఉంటుంది. ఈ రహదారిలో మోటార్‌బైక్‌లపై వెళ్లేవారు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

వెలిగొండకు చంద్ర గ్రహణం

బడ్జెట్‌లో నామమాత్రంగా నిధులు
- 2014–19 మధ్య పనులు గాలికి...
- వైఎస్సార్ హయాంలోనే వేగవంతంగా నిర్మాణం
- జగన్ హయాంలో సొరంగాలు, హెడ్ రెగ్యులేటర్ పనుల పూర్తి

వెలిగొండకు దశాబ్దాలుగా గ్రహణం పట్టింది. ప్రజలకు ఉపయోగపడే ఈ పనులు చేయడంలో చంద్రబాబు ఎప్పుడూ నిర్లక్ష్యం వహిస్తుంటారు. వేరే వాళ్లు చేసిన పనులను మాత్రం తన క్రెడిట్‌గా చెప్పుకొనేందుకు ఏ మాత్రం వెనుకాడరు. సాగునీటి ప్రాజెక్ట్‌లను బాబు ఏనాడూ పట్టించుకోలేదు. కానీ రైతులపై మాత్రం ప్రేమ ఉన్నట్లు నటిస్తుంటారు.




జగన్ పాలనలో పూర్తయిన జంట టన్నెల్స్ వ్యూ

ఉదయగిరి: కూటమి ప్రభుత్వానికి వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం విషయంలో చిత్తశుద్ధి లోపించింది. మూడు దఫాలుగా సీఎంగా ఉన్న చంద్రబాబు ఈ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని గాలికొదిలేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నామమాత్రపు నిధులు కేటాయించారు. అధికారంలో ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేయడం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నికల అంశంగా మార్చుకోవడం బాబు నైజంగా మారింది.

కొన్నేళ్ల క్రితం దీనికి చంద్రబాబు శంకుస్థాపన చేసి ఆ తర్వాత పట్టించుకోలేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పనులు శరవేగంగా జరిగాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండు సొరంగాలతోపాటు, బ్యాక్ వాటర్ హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తి చేశారు. ఆయన మళ్లీ సీఎం అయ్యుంటే ఈ రబీ సీజన్ నుంచి ప్రకాశం, నెల్లూరు మెట్ట ప్రాంతాల్లో కృష్ణమ్మ జలాలు పారేవి. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి బీడు పొలాలకు నీరివ్వకుండా గత ప్రభుత్వంలో పనులు జరగలేదంటూ తప్పుడు ప్రచారం చేయడంపై రైతులు మండిపడుతున్నారు.

ఖర్చు చేసి..

నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లో సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంగా వైఎస్ రాజశేఖర రెడ్డి 2004 అక్టోబర్ 27న వెలిగొండ ప్రాజెక్ట్ పనులకు శ్రీకారం చుట్టారు. రూ.8043.8 కోట్లకు పాలనా ఆమోదం తీసుకుని రూ.3,610.38 కోట్లు ఖర్చు చేసి 20.333 కి.మీ (మొత్తం పొడవు 37.587 కి.మీ) జంట సొరంగాలు పనులు జరిగాయి. ప్రాజెక్ట్‌లో అంతర్భాగంగా ఉన్న నల్లమలసాగర్ పనులు పూర్తి చేశారు.


వెలిగొండ ప్రాజెక్ట్ మ్యాప్

కాంట్రాక్టర్లకు దోచిపెట్టిన బాబు

చంద్రబాబు పాలనలో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్లక్ష్యానికి గురైంది. శంకుస్థాపన చేసిన బాబు సర్వే పేరుతో కాలయాపన చేశారే తప్ప పైసా కూడా కేటాయించలేదు. 2014 – 19 మధ్య ప్రకాశం జిల్లా పర్యటనకు ఐదుసార్లు వచ్చారు. ప్రతిసారీ త్వరలో పూర్తి చేస్తామని మభ్యపెట్టారు. 2019 ఎన్నికలకు ముందు ప్రకాశం జిల్లా పర్యటనకు వచ్చిన బాబు త్వరలో పూర్తి చేసి ప్రాజెక్ట్‌ను ప్రజలకు అంకితం చేస్తామని చెప్పి మాట తప్పారు. 2014–2019 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.1,385.81 కోట్లు ఖర్చు చేసి అందులో రూ.630 కోట్లను అప్పనంగా తమ అనుకూల కాంట్రాక్టర్లకు దోచి పెట్టినట్లు కాగ్ తప్పు పట్టింది. చంద్రబాబు బినామీ సీఎం రమేష్‌కు నామినేషన్ విధానంలో పనులు అప్పగించి రూ.వందల కోట్లు దోచి పెట్టారని నాడు విమర్శలు వచ్చాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తర్వాత పనులు వేగం పుంజుకున్నాయి. జంట సొరంగాలు, బ్యాక్ వాటర్ హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తి చేసి జాతికి అంకితం చేశారు.

ప్రాజెక్ట్ వివరాలు

నీటి నిల్వ సామర్థ్యం : 45 టీఎంసీలు
లబ్ధి చేకూరే జిల్లాలు : వైఎస్సార్, నెల్లూరు, ప్రకాశం
ఆయకట్టు : 5 లక్షల ఎకరాలు
తాగునీరు : 15 లక్షల మందికి..

కొత్త డ్రామా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్ట్ గురించి పట్టించుకోవడం లేదు. ఇటీవల మంత్రి నిమ్మల రామానాయుడు మరో మంత్రి రవి కుమార్‌తో కలిసి అక్కడికి వెళ్లి గత ప్రభుత్వంలో పనులు ఏమీ జరగనట్లు అసత్య ప్రచారం చేశారు. పూర్తి చేసి తామే సాగునీరు ఇస్తామని నిమ్మల చెప్పారు. అయితే బడ్జెట్‌లో కేవలం రూ.394 కోట్లు కేటాయించి చేతులు దులుపుకొన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తి కావాలంటే కనీసం రూ.4 వేల కోట్లు అవసరమని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

గత ప్రభుత్వంలో శరవేగంగా పనులు



వెలిగొండ పనులు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పరుగులు తీశాయి. కరోనా కష్టకాలంలో కూడా వైఎస్ జగన్ ప్రాజెక్ట్ నిర్మాణంలో కీలకమైన జంట సొరంగాల పనులు పూర్తి చేయించారు. నల్లమలసాగర్ బ్యాక్‌వాటర్ హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తి చేశారు. వైఎస్సార్, జగన్ పాలనలో నిధులు ఎంత కేటాయించారో, టీడీపీ పాలనలో ఎంత కేటాయించారో తేడా చూస్తే తెలిసిపోతుంది. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే ఈ రబీలో సాగునీటితో మెట్ట ప్రాంతం సస్యశ్యామలంగా ఉండేది.
– మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త

సైబర్ నేరాలపై విస్తృత అవగాహన

- పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి
- ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. నెల్లూరులోని డీకేడబ్ల్యూ, హరనాథపురంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన సదస్సుల్లో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని చదువుల్లో రాణించాలన్నారు. యువతులు, చిన్నారులపై నేరాలు జరుగుతున్నాయని, పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. బాలబాలికలు ప్రతి విషయాన్ని తల్లిదండ్రులతో పంచుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. వాటికి బానిసైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. గంజాయి, డ్రగ్స్ రవాణా చేసినా, విక్రయించినా కేసులు తప్పవన్నారు. ఒక్కసారి డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేరన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు సీబీఐ, ఈడీ, కస్టమ్స్, ఏసీబీ అధికారుల ముసుగులో మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పోస్టు చేయరాదన్నారు. అత్యవసర వేళల్లో 112కు లేదా స్థానిక పోలీసులకు ఫోన్ చేస్తే తక్షణ సహాయం అందుతుందన్నారు. నెల్లూరు నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సదస్సులు జరిగాయి. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నెల్లూరు నగర, రూరల్, మహిళా డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు, చెంచు రామారావు, కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



డీకేడబ్ల్యూ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

- అవగాహనతోనే సైబర్ నేరాల కట్టడి అనే నినాదంతో పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు.

ఇద్దరు ఘరానా దొంగల అరెస్ట్

- రూ.5 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- నిందితులపై తెలుగు రాష్ట్రాల్లో కేసులు

కందుకూరు: ఇద్దరు ఘరానా దొంగల్ని వలేటివారిపాళెం పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం వివరాలు వెల్లడించారు. వలేటివారిపాళెం మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన మద్దులూరి ప్రభాకర్ ఇంట్లో ఈనెల 7వ తేదీన చోరీ జరిగింది. దొంగలు పట్టపగలు బంగారు నగలు అపహరించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా గుంటూరు నగరంలోని శారదా కాలనీకి చెందిన చిల్లర సురేష్, కావలిలోని బాలకృష్ణారెడ్డి నగర్‌కు చెందిన సయ్యద్ ఫయాజ్‌లు దొంగతనం చేసినట్లు గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి 110 గ్రాముల బంగారు ఆభరణాలు, 900 గ్రాముల వెండితోపాటు, యమహా ఎఫ్‌జెడ్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వీరు పాత నేరస్తులుగా తేలింది. గత జూన్‌లో వలేటివారిపాళెం మండలంలోనే బడేవారిపాళెం గ్రామంలో పాడపాటి రమణమ్మ ఇంట్లో నాలుగు సవర్ల బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో కొత్తగూడెం జిల్లా గుండాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ షాపులో సుమారు కేజీ వెండిని చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు సురేష్‌పై పలు జిల్లాల్లో 15 దొంగతనం, గంజాయి కేసులు, సయ్యద్ ఫయాజ్‌పై ఐదు గంజాయి, దొంగతనం కేసులున్నట్లు బయటపడింది. మొత్తంగా వారి నుంచి రూ.5 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన వలేటివారిపాళెం ఎస్సై మరిడి నాయుడు, కానిస్టేబుళ్లు జె.మునికృష్ణ, ఎస్.కిశోర్, బి.మహేంద్రను అభినందించారు. సమావేశంలో గుడ్లూరు సీఐ జి.మంగారావు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం